రేపటి నుంచి రెండో విడత శిక్షణ

ఆదిలాబాద్‌టౌన్: ఖానాపూర్ నియోజక వర్గ పరిధిలో ఎన్నికల విధులు కేటాయించిన పీవోలు, ఓపీవోలకు ఉట్నూర్‌లోని కేజీ కాంప్లెక్స్‌లోని బీఎడ్ కళాశాలలో రేపటి నుంచి రెండో విడత శిక్షణ ఉంటుందని నిర్మల్ డీఈవో రవీందర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఈనెల 21 నుంచి 24 వరకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. విషయాన్ని గమనించాలని ఆయన సూచించారు.

నేడు ఆదిలాబాద్‌కు బండి సంజయ్

ఆదిలాబాద్: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి రానున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్టీ అభ్యర్థి పాయల్ శంకర్ తరఫున జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్ల గుండా నిర్వహించనున్న రోడ్‌షోలో పాల్గొననున్నారు.

గరిష్టం/కనిష్టం
33.0/18.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమ శాతం పెరగనుంది. రాత్రి చలి ప్రభావం కనిపించే అవకాశముంది.

న్యూస్‌రీల్

జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడిగా నితిన్ పాటిల్



నితిన్‌పాటిల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా అసెంబ్లీ ఎన్నికల సాధారణ పరిశీలకుడిని ఎన్నికల సంఘం మార్చింది. ప్రస్తుతం జిల్లా సాధారణ పరిశీలకుడిగా ఉన్న గణేశ్ బాపురావ్ పాటిల్ సెలవుపై వెళ్లనుండటంతో ఆయన స్థానంలో 2007 ఐఏఎస్ బ్యాచ్ అధికారి నితిన్‌పాటిల్‌ను నియమించింది. ఆదివారం జిల్లాకు చేరుకున్న ఆయనను స్థానిక పెన్‌గంగ గెస్ట్‌హౌస్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. జిల్లాలో చేపట్టిన ఎన్నికల ఏర్పాట్లను ఆయనకు వివరించారు.

ప్రలోభాలకు లోనుకావద్దు



తంతోలిలో కవాతులో పాల్గొన్న పోలీసులు

ఆదిలాబాద్‌రూరల్: ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ధైర్యంగా ఓటు వేయాలని ఆదిలాబాద్ డీఎస్పీ ఉమేందర్ అన్నారు. మండలంలోని తంతోలి గ్రామంలో ఆదివారం పోలీసు బలగాలు కవాతు నిర్వహించాయి. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహించడమే లక్ష్యంగా ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రూరల్ సీఐ సైదారావు, ఎస్సైలు ముజాహిద్, గోవింద్, మహేందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

ఇంద్రవెల్లి: అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఉట్నూర్ సీఐ రామకృష్ణ అన్నారు. మండలంలోని కేస్లాపూర్, పిట్టబొంగరం, దస్నాపూర్, డొంగర్‌గామ్, భీంజితండా, హర్కపూర్‌తండా గ్రామాలను ఆదివారం ఆయన సందర్శించారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సాగేందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై సునిల్, తదితరులు ఉన్నారు.

పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

ఇంద్రవెల్లి: గ్రామ పంచాయతీల్లో పన్ను వసూళ్లు వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. మండలకేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణ పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సిబ్బంది సంజీవ్‌రావు, ఇద్రిస్, నారాయణ తదితరులు ఉన్నారు.

టీమిండియా గెలవాలని ప్రార్థనలు



ప్రార్థనల్లో పాల్గొన్న సమితి సభ్యులు

ఆదిలాబాద్: వరల్డ్‌కప్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో టీమిండియా విజయం సాధించాలని సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. వరల్డ్‌కప్ నమూనాతో జాతీయ జెండాలు ప్రదర్శిస్తూ వేద పండితులు, ఇమామ్‌లు, చర్చి పాదర్స్‌తో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇందులో సమితి జిల్లా అధ్యక్షుడు ప్రమోద్ కుమార్, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, కోచ్ గజేందర్ పటాస్కర్, మాజీ సైనికులు మజర్, రాజు తదితరులున్నారు.

ఇందిరమ్మ రాజ్యం తెస్తాం

- ఇది భీమ్, రాంజీ వీరుల భూమి
- 'జల్ జంగల్ జమీన్' పోరుగడ్డ
- భూపట్టాలిచ్చాం.. ఐటీడీఏలు పెట్టాం
- ఆదివాసీలకు ఇందిరమ్మ ఎన్నో చేసింది
- బీఆర్‌ఎస్, బీజేపీ ఏంచేశాయో అడగండి
- ఖానాపూర్, ఆసిఫాబాద్ సభల్లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ
- సభల సక్సెస్‌తో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్



ఖానాపూర్‌లో సభలో ప్రసంగిస్తున్న ప్రియాంకాగాంధీ, వేదికపై పార్టీ అభ్యర్థులు వెడ్మ బొజ్జు, ఆడె గజేందర్, శ్రీహరిరావు

నిర్మల్/ఖానాపూర్/సాక్షి, ఆసిఫాబాద్: 'కుమురం భీమ్, రాంజీగోండు, సమ్మక్క–సారలమ్మ లాంటి వీరుల భూమి ఇది. జల్ జంగల్ జమీన్ కోసం పోరాడిన గడ్డ ఇది. ఆదివాసులది ప్రపంచంలోనే గొప్ప సంస్కృతి. గిరిజన బిడ్డల కోసం ఇందిరమ్మ ఎన్నో చేసింది. అందుకే 40 ఏళ్లయినా దేశంలో ఏ మారుమూల గ్రామానికి వెళ్లినా తనను గుర్తుచేస్తుంటారు.. కాంగ్రెస్‌ను గెలిపిస్తే.. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం తెస్తాం' అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ అన్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం వేర్వేరుగా ఎన్నికల ప్రచార సభలు నిర్వహించారు. ఖానాపూర్‌లో పార్టీ అభ్యర్థి వెడ్మ బొజ్జుపటేల్ తరఫున, ఆసిఫాబాద్‌లో అభ్యర్థి శ్యాంనాయక్ తరఫున ప్రచారం చేశారు. ఆదివాసీ నేతలైన బొజ్జుపటేల్, శ్యాం నాయక్‌ను గెలిపించాలని కోరారు. రెండు సభలు సక్సెస్ కావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ కనిపించింది.

భూమి పట్టాలు, ఐటీడీఏలు..

ఆదివాసీలు, గిరిజన బిడ్డల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో చేసిందని, ఇక ముందూ సంక్షేమ ఫలాలు అందిస్తుందని ప్రియాంకాగాంధీ తెలిపారు. తన నానమ్మకు ఆదివాసీలంటే చాలా ఇష్టమని, వారికోసం చాలా కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. భూములపై హక్కులు, పట్టాలు, పక్కా ఇళ్లు ఇచ్చారన్నారు. గిరిజనుల సంపూర్ణ వికాసం, అభివృద్ధి కోసం ఐటీడీఏలను ఏర్పాటు చేశారని చెప్పారు. ఇందిరమ్మ పుట్టిన రోజునే ఇలా ఆదివాసీలను కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.

విజన్‌తో అభివృద్ధి చేస్తాం

పదేళ్లపాటు రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్ ప్రజల కలలను ఒక్కొక్కటిగా నాశనం చేస్తూ వచ్చారని ప్రియాంకాగాంధీ ఆరోపించారు. యువతకు ఉద్యోగాలు, రైతులకు రుణమాఫీ, మహిళలకు సంక్షేమ ఫలాలు ఇవ్వలేదని విమర్శించారు. పథకాలు, అభివృద్ధి పేరిట చేపట్టిన పనుల్లో రూ.కోట్లు దోచుకున్నారని, అన్నింట్లో అవినీతి పెరిగిపోయిందని ఆరోపించారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే ముందుచూపుతో ప్రజల అభివృద్ధికి కృషిచేస్తామని తెలిపారు. ఇందులో భాగంగానే ఆరు గ్యారంటీలను తీసుకువచ్చామని చెప్పారు. ఓటు కోసం వచ్చే బీఆర్‌ఎస్, బీజేపీ ఏం చేశాయో నిలదీయాలని పిలుపునిచ్చారు. ఖానాపూర్ అభ్యర్థి వెడ్మ బొజ్జుపటేల్, నిర్మల్ అభ్యర్థి శ్రీహరిరావు, బోథ్ అభ్యర్థి ఆడె గజేందర్, ఆదిలాబాద్ అభ్యర్థి కంది శ్రీనివాస్‌రెడ్డిని వేదికపై చూపిస్తూ వారిని గెలిపించాలని కోరారు.

ఆకట్టుకున్న ప్రసంగం

ఆసిఫాబాద్ సభలో ప్రియాంకాగాంధీ ప్రపంచ కప్ క్రికెట్ గురించి మాట్లాడటంతో సభలో హర్షధ్వానాలు వ్యక్తమయ్యాయి. ఇండియా కచ్చితంగా గెలుస్తుందని.. 1983లో ఇండియా ప్రపంచ కప్ గెలుచుకున్న సందర్భంలో తన నానమ్మ ఇందిరాగాంధీ టీం సభ్యులకు ఇచ్చిన విందు గురించి తనకు గుర్తుందని అప్పటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. ఆమె ప్రసంగాన్ని తెలుగులో అనువాదం చేయడానికి కాంగ్రెస్ నేత ఒకరు సిద్ధమవుతుండగా.. ప్రియాంక 'అనువాదం కావాలా.. హిందీలో ప్రసంగం కొనసాగించనా..' అని అడగ్గా.. ప్రజలు తెలుగులో అనువాదం కావాలని కోరారు. దీంతో ఆమె తెలుగు అనువాదానికి అంగీకరించి ప్రసంగం కొనసాగించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక యువత, అక్కచెల్లెమ్మలు పడుతున్న కష్టాల గురించి చెబుతూ.. 'కేసీఆర్ హయాంలో యువతకు ఉపాధి దొరికిందా? అక్కచెల్లెమ్మల పురోగతికి ప్రభుత్వం పనిచేసిందా?' అని ప్రియాంక సభికులను ప్రశ్నించగా.. అందరూ ముక్తకంఠంతో లేదు.. లేదు.. అని సమాధానం ఇవ్వడం కనిపించింది. దాదాపు 50 నిమిషాల పాటు ఆమె ప్రసంగం కొనసాగింది. ఆయా సభల్లో మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్‌రావుచవాన్, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ జోనల్ ఇన్‌చార్జి విష్ణునాథ్, ఖానాపూర్ పరిశీలకుడు ప్రజ్ఞానంద్ ఖర్గే, ఏఐసీసీ సెక్రటరీ రోహిత్‌చౌదరి, ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్, రాజురా ఎమ్మెల్యే సుభాష్ దోటే, కర్ణాటక ఎమ్మెల్సీ ప్రకాశ్‌రాథోడ్, మాజీ ఎమ్మెల్సీ రాజయ్య, సిర్పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి రావి శ్రీనివాస్, నిర్మల్ బోథ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థులు కూచాడి శ్రీహరిరావు, ఆడె గజేందర్, కంది శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గుండా శ్యాం, మంగ, గణేశ్, అనిల్‌గౌడ్, మునీర్, ఆసిఫ్, సత్తు మల్లేశ్, పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, దయానంద్, చిన్నం సత్యం, షబ్బీర్‌పాషా, నిమ్మల రమేశ్, సతీశ్‌రెడ్డి, దుర్గాభవాని, జహీర్ హైమద్, మజీద్, గుగ్లావత్ రాజు, జంగిలి శంకర్, గంగనర్సయ్య, సలీంఖాన్, సీపీఐ నాయకులు బద్రి సత్యనారాయణ, భోగే ఉపేందర్, అల్లూరి లోకేశ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బహిరంగ సభకు హాజరైన కాంగ్రెస్ శ్రేణులు

గెలిపిస్తారనే నమ్మకంతో ఉన్నం..



'ఎకరం 38 గుంటల భూమి మాత్రమే ఉన్న పేదోడిని.. ఇప్పటికీ ఇందిరమ్మ ఇంట్లోనే ఉంటున్న. తెలంగాణ ఇచ్చిన సోనియమ్మ బిడ్డ నాకోసం ఖానాపూర్ గడ్డకు రావడం చాలా అదృష్టంగా భావిస్తున్న. ఈ పేదోడికి ఒక్క అవకాశమిచ్చి గెలిపించండి. ఖానాపూర్ నియోజకవర్గంలో 33 ఏళ్లుగా కాంగ్రెస్ గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలపై నమ్మకంతో ఉన్నారు. మా నమ్మకాన్ని నిలబెట్టాలని కోరుతున్న..' అంటూ ఖానాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జుపటేల్ అభ్యర్థించారు. వైఎస్సార్ హయాంలో ఖానాపూర్, కడెం మండలాల రైతుల చిరకాల స్వప్నం సదర్మాట్ బ్యారేజీని మంజూరు చేస్తే, బీఆర్‌ఎస్ పాలనలో నిర్మల్ ప్రాంతానికి తరలించినా నేటికీ పూర్తి చేయలేదన్నారు. కడెం ప్రాజెక్ట్‌కు కనీసం మరమ్మతు చేయించలేని స్థితిలో ప్రభుత్వం ఉందని ఆరోపించారు. స్థానికేతరుడిని, తన బినామీతో కేటీఆర్ పోటీ చేయిస్తున్నారని, ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

ఆసిఫాబాద్ గడ్డ.. కాంగ్రెస్ అడ్డా



ఆసిఫాబాద్ అభ్యర్థి శ్యాంనాయక్ మాట్లాడుతూ.. జిల్లాలో ఆదివాసీలు ఎన్నో కష్టాలు పడుతున్నారని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. వట్టివాగు, అడ ప్రాజెక్టుల్లో నీరున్నా పంటలకు అందించే లేని దుస్థితి ఉందని తెలిపారు. స్థానికంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం 10 ఏళ్లున్నా అభివృద్ధి శూన్యమన్నారు. నియోజకవర్గంలో ప్రధాన సమస్యలైన గుండి బ్రిడ్జి, అప్పపల్లి రహదారి, తుంపల్లి వాగుపై హైలెవెల్ బ్రిడ్జి అనార్పల్లి బిడ్జిలతోపాటు ఇతర ప్రజాసమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని, అంబేద్కర్ ఆశయాల మేరకు పని చేస్తానని తెలిపారు. ఆసిఫాబాద్ గడ్డపై మరోసారి కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని కోరారు.

గంపగుత్త ఓట్లపై దృష్టి

- ఫోకస్ పెంచిన ప్రధాన పార్టీలు
- మహిళా, యువజన సంఘాలకు గాలం
- తాయిలాలతో ఆకర్షించే యత్నం
- ద్వితీయ శ్రేణి నాయకులకు బాధ్యతలు

జిల్లాలోని మహిళా సంఘాలు..	
గ్రామ సమాఖ్య	577
స్వయం సహాయక	10,741
ఆయా సంఘాల్లోని సభ్యులు	1,15,730

యువజన సంఘాలు	630
యువజన సంఘాల్లోని సభ్యులు	10,464

కైలాస్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ప్రధానపార్టీల అభ్యర్థులంతా క్షణం తీరిక లేకుండా పల్లె, పట్టణమనే తేడా లేకుండా సుడిగాలిలా చుట్టేస్తున్నారు. ఓటర్లను ఆ ప్యాయంగా పలుకరిస్తూ వారి మద్దతు కూడగట్టుకునేందుకు యత్నిస్తున్నారు. గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఏ ఒక్క ఓటు చేజారకుండా జాగ్రత్త పడుతున్నారు. గంపగుత్త ఓట్లపైనే ఎక్కువగా దృష్టి పెడుతున్నారు. ఇందుకోసం యువజన, స్వయం సహాయక, కుల సంఘాలపై ఫోకస్ చేస్తున్నారు. ఆయా వర్గాల వారిని తమ వైపు తిప్పుకుంటే మెజార్టీ ఓట్లు పడే అవకాశముందని భావిస్తున్నారు. వారిని ఆకర్షించి పార్టీ వైపు వచ్చేలా చూడాల్సిన బాధ్యతలను ద్వితీయ శ్రేణి నాయకులకు అప్పగిస్తున్నారు. దీంతో రంగంలోకి దిగిన సదరు నాయకులు ఆయా వర్గాల వారితో సంప్రదింపులు జరుపుతూ వారిని ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

మహిళా, యువజన సంఘాలపై ఫోకస్

ఎన్నికలకు గడువు సమీపిస్తున్న కొద్ది ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచార పంథా మార్చుకుంటున్నారు. ప్రధానంగా గంపగుత్తగా ఓట్లు వచ్చే యువజన, మహిళా, కుల సంఘాల మద్దతు కోసం ఆరాటపడుతున్నారు. అభ్యర్థుల ఆదేశాలతో రంగంలోకి దిగిన ద్వితీయ శ్రేణి నాయకులు తమ పార్టీకి మద్దతిస్తే అన్ని విధాలా అండగా ఉంటామని వారికి భరోసా కల్పిస్తున్నారు. అడిగినవి ఇచ్చేందుకు సిద్ధమని ప్రకటిస్తున్నారు. అయితే వారితో పాటు బంధువులు, స్నేహితులు, సంఘ సభ్యుల ఓట్లన్నీ తమకే పడేలా చూడాలని కోరుతున్నారు. ఇందు కోసం ఆయా సంఘాలకు నగదుతో పాటు యువజన సంఘాలకు క్రీడా కిట్లు అందజేస్తున్నారు. తాము గెలిస్తే స్వయం ఉపాధికి రుణాలు ఇవ్వడంతో పాటు సంఘాలకు అవసరమైన అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీలిస్తున్నారు. సంఘ భవనాలు నిర్మించి ఇస్తామని చెబుతున్నారు. దీంతో ఆయా సంఘాల్లోని ప్రధాన నాయకులతో పాటు కీలకంగా వ్యవహరించే వారికి తీవ్ర డిమాండ్ ఏర్పడింది.

సంఘాల చుట్టూ ప్రదక్షిణలు

మహిళా సంఘాల మద్దతు కోసం ఆయా గ్రామాలు, వార్డుల్లోని చురుగ్గా వ్యవహరించే మహిళా నాయకురాళ్లకే బాధ్యతలు అప్పగిస్తున్నారు. అలాగే యువజన సంఘాల బాధ్యతలను పార్టీ యువజన విభాగం నాయకులకు అప్పగిస్తుండగా, కుల సంఘాలను ఆకర్షించే బాధ్యతలను ఆయా సంఘాల పెద్దలకు అప్పగిస్తున్నారు. దీంతో రంగంలోకి దిగిన ఆయా వర్గాల నాయకులు సంఘాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వేకువజామున, రాత్రి పూట సంఘాల్లోని కీలక వ్యక్తుల ఇళ్లకు వెళ్లి సంప్రదింపులు జరుపుతున్నారు. తమకు మద్దతునిస్తే సంఘాలు ఏం ఆశిస్తున్నారనే సమాచారాన్ని ఆరా తీస్తున్నారు. విషయాన్ని అభ్యర్థుల దృష్టికి తీసుకెళ్లి వారడిగింది ఇచ్చేలా చూస్తున్నారు. అప్పటికప్పుడు డబ్బులను సైతం ముట్టజెబుతున్నట్లు తెలుస్తోంది.

ఓటు వజ్రాయుధం

- తప్పనిసరిగా వినియోగించుకోవాలి
- ప్రలోభాలకు లోనుకావొద్దు
- వైద్యులు, గురువుల అభిప్రాయం

ఓటు వజ్రాయుధం వంటిదని, ప్రజాస్వామ్యంలో తప్పనిసరిగా వినియోగించుకోవాలని వైద్యులు, ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల్లో ఓటు హక్కు ద్వారా మనకు నచ్చిన నేతను ఎన్నుకోవచ్చని అంటున్నారు. ఓటు వేయకపోతే రాజ్యాంగం కల్పించిన హక్కును కోల్పోయినట్లేనని చెబుతున్నారు. నోటుకు ఓటు అమ్ముకుంటే ఐదేళ్ల పాటు ఇబ్బందులకు గురికావాల్సిందేనని, ప్రశ్నించే హక్కును కోల్పోతామని పేర్కొన్నారు. కులం, మతం, డబ్బుకు ఆశపడితే మనతో పాటు భావితరాలకు అన్యాయం చేసినవారు అవుతామని అంటున్నారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో వందశాతం పోలింగ్‌కు సహకరించేలా ప్రతీ పౌరుడు బాధ్యతగా ఓటు వేయాలని కోరుతున్నారు. – ఆదిలాబాద్‌టౌన్



డాక్టర్స్ & టీచర్స్ పల్స్

మంచి నాయకుడిని ఎన్నుకోవాలి



స్వప్రయోజనాల కోసం కాకుండా అందరికి మేలు చేసే నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఓటు హక్కు మనకు కల్పిస్తోంది. దీనిని ప్రతి ఒక్కరూ బాధ్యతగా సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ రమ, గైనకాలజిస్ట్, ఆదిలాబాద్

అభివృద్ధి చేసే వారికే ఓటేయాలి



ఈ ఎన్నికల్లో ప్రజా సమస్యలు పరిష్కరించే, అభివృద్ధి చేసే నాయకునికే ఓటు వేయాలి. ప్రలోభాలకు గురికావద్దు. అప్పుడే మన ప్రాంతాలు అభివృద్ధి వైపు పరుగులు పెడతాయి.

– డాక్టర్, రజిత, గైనకాలజిస్ట్, ఆదిలాబాద్

మోసపూరిత మాటలు నమ్మొద్దు



ప్రజా సమస్యలు పరిష్కరించి అభివృద్ధి చేసే నాయకులకే పట్టం కట్టాలి. కేవలం పదవులు అనుభవించేందుకు పోటీ చేసే నేతలను దూరంగా ఉంచాలి. మోసపూరిత మాటలు నమ్మవద్దు.

– డాక్టర్ వెంకట్ రెడ్డి, రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆదిలాబాద్

ప్రశ్నించే హక్కు కోల్పోతాం



ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి. ఓటు వేయని వారు ప్రశ్నించే హక్కును కోల్పోతారు. విద్యావంతులను ఎన్నుకుంటే అందరి సమస్యలు పరిష్కారమవుతాయి.

– డాక్టర్ క్రాంతి కుమార్, రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్

అవగాహన కల్పిస్తున్నాం



రిమ్స్‌లో చదువుతున్న మెడికోలకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్నాం. ఓటు వజ్రాయుధమని, తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచిస్తున్నాం. ఓటు హక్కు లేనివారికి నమోదు చేయించాం.– జైసింగ్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్

ఓటేయకుంటే బాధపడాల్సిందే



ఓటు హక్కుపై ప్రజలు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలి. అప్పుడే మంచి నాయకుడిని ఎన్నుకోగలుగుతాం. ఐదేళ్లకోసారి వచ్చే ఓటును వినియోగించుకోకుంటే భవిష్యత్తులో మనం బాధపడాల్సి ఉంటుంది.

– చిల్క సతీష్, టీచర్, ఆదిలాబాద్

పేద, ధనిక తేడా ఉండదు



రాజ్యాంగం పేద, ధనిక తేడా లేకుండా ప్రతిఒక్కరికి ఓటు హక్కు కల్పించింది. అది శక్తివంతమైనది. మనకు నచ్చిన నాయకుడిని ఎన్నుకునే అధికారం మన చేతుల్లోనే ఉంది.

– శివకుమార్, ఉపాధ్యాయుడు

అమ్ముకోవద్దు



ఎన్నికలప్పుడు ఓటుకు నోటు ఇచ్చి.. తర్వాత ఏదైన పనికోసం వెళ్తే చులకనగా చూస్తారు నాయకులు. అందుకే ఓటును పవిత్రంగా భావించి నిస్వార్థంగా ప్రజాసేవ చేసే వారికే వేయాలి.

– సత్యనారాయణ, టీచర్, ఆదిలాబాద్

రాజ్యాంగం కల్పించిన హక్కు..



రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతీ ఓటరు తప్పనిసరిగా వినియోగించుకోవాలి. ఒకే ఓటుతో ఫలితాలు తారుమారైన సందర్భాలున్నాయి. విషయాన్ని గమనించాలి.

– శ్రీహరిబాబు, టీచర్, ఆదిలాబాద్

చాలా విలువైంది



ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైంది. డబ్బు, కులం, మతం, ఇతర ప్రలోభాలకు లోను కాకూడదు. ఓటు వేయకపోతే మనం తప్పుచేసినట్టే.

– పసుల ప్రతాప్, టీచర్, ఆదిలాబాద్


ప్రియాంకసభకు యూపీ నుంచి..



కాంగ్రెస్ జెండాతో వీరాభిమాని

ఖానాపూర్: ఉత్తరప్రదేశ్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ వీరాభిమాని పండిత్ అనోకోలాల్ తివారీ ఖానాపూర్ మండలంలోని సుర్జాపూర్ ఎన్టీఆర్ చౌరస్తాలో నిర్వహించిన ప్రియాంకగాంధీ బహిరంగసభలో భారీ జెండాతో కనిపించాడు. ఈ విషయమై అతడిని సంప్రదించగా తాను కాంగ్రెస్ పార్టీ వీరాభిమానినని, ఇప్పటివరకు మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మిజోరాం, తెలంగాణ ప్రాంతాల్లో జరిగిన రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ సభల్లో పాల్గొని ప్రచారం చేస్తున్నట్లు తెలిపాడు. 70కిలో మీటర్ల దూరం నుంచి పాదయాత్రగా ఖానాపూర్‌కు చేరుకున్నానని వివరించాడు. త్వరలో తెలంగాణలో జరగనున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 80సీట్లు సాధించనున్నట్లు ఆశాభావం వ్యక్తం చేశాడు.

వృక్షాకారం... గజరూపం



ఈ చిత్రాన్ని చూశారా... ఇందులో వింతేముందనుకుంటే పొరబడినట్లే. తలమడుగు మండలం భరంపూర్ గ్రామ అటవీ ప్రాంతంలోని ఓ మోదుగ వృక్షం గజరూపంతో కూడిన ఆకారంతో ఉండి చూపరులను ఆకర్షిస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

క్లుప్తంగా

పేకాటరాయుళ్ల అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసుస్టేషన్ పరిధిలోని దోబి కాలనీ, దస్నాపూర్ ఏరియాలో పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ డి.సాయినాథ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సమాచారం మేరకు ఆదివారం సిబ్బందితో కలిసి దాడులు చేసి మిట్టపుర్ అశోక్, చాంద్ పాషా, రాజేష్, అశోక్‌లను పట్టుకొని వారి వద్ద నుంచి రూ.1,420 నగదుతో పాటు పేకాట ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు మావల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పార్టీ మారే... పదవి వరించే

• ఓటమి నుంచి పార్లమెంట్‌లోకి అడుగు • మంత్రిగానూ బాధ్యతల నిర్వహణ

జంగ్ తెలంగాణ

కైలాస్‌నగర్: ఎన్నికల్లో గెలుపోటములు ఎంత సహజమో... రాజకీయ నాయకులు ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో.. ఏ పదవిలో ఉంటారనేది కూడా అంతే సహజం. కొంతమంది నాయకులు ఎంతగా ప్రయత్నించినా ఏళ్లుగా పదవి దక్కకుండా దురదృష్టవంతులుగా నిలిస్తే మరి కొంతమంది దురదృష్టాన్ని తమ అదృష్టంగా మార్చుకుని అందలమెక్కుతారు. అందుకనే రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదని చెబుతుంటారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇలాంటి కోవకే చెందిన నాయకులున్నారు. తాజా ఎన్నికల్లో మరోసారి అసెంబ్లీ బరిలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. వారెవరనేదాన్ని పరిశీలిస్తే....

కండువా మార్చి.. పార్లమెంట్‌లో అడుగిడి



ఎక్సైజ్‌శాఖ అధికారిగా పనిచేసిన బొర్లకుంట వెంకటేష్ నేత తన ఉద్యోగానికి స్వచ్ఛందంగా పదవీ విరమణ చేసి రాజకీయాల్లోకి అడుగు పెట్టాడు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో చెన్నూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిత్వాన్ని దక్కించుకుని ఎమ్మెల్యేగా పోటీ చేశాడు. బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ చేతిలో 28,132 ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యాడు. మరుసటి ఏడాది జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌లో చేరి పెద్దపల్లి ఎంపీగా పోటీ చేసిన ఆయన కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్‌పై 95,180 ఓట్ల అధిక్యంతో విజయం సాధించి పార్లమెంట్‌లోకి అడుగుపెట్టాడు.

పార్టీ మారారు.. మంత్రి అయ్యారు



జిల్లా రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడైన అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి జెడ్పీ చైర్మన్, ఎంపీ, ఎమ్మెల్యేగా సేవలందించాడు. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో 2014లో బీఎస్పీ తరఫున అసెంబ్లీ బరిలో నిలిచిన ఆయన బీఆర్ఎస్ అభ్యర్థి శ్రీహరిరావుపై 8497 ఓట్ల అధిక్యంతో ఎమ్మెల్యేగా విజయం సాధించాడు. మరుసటి ఏడాది బీఎస్పీకి గుడ్‌బై చెప్పి మరో ఎమ్మెల్యే కోనేరు కోనప్పతో కలిసి అధికార బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన కొంత కాలానికే రాష్ట్ర దేవాదాయ, న్యాయ, గృహ నిర్మాణ శాఖ మంత్రిగా పదవి చేపట్టారు. స్వరాష్ట్రంలో ఆ శాఖల బాధ్యతలను నిర్వహించిన తొలి మంత్రిగా ఘనత దక్కించుకున్నాడు.

అసెంబ్లీకి ఓడి.. అనూహ్యంగా గెలిచి



బోథ్ నియోజకవర్గం నుంచి ఓసారి అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించిన సోయం బాపూరావు 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో అధికార బీఆర్ఎస్ అభ్యర్థి రాథోడ్ బాపూరావు చేతిలో 6,486 స్వల్ప ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యాడు. అనంతరం ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి 2019 మార్చి 15న బీజేపీలో చేరాడు. ఆ పార్టీ తరఫున అదే ఏడాది జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసిన సోయం, అధికార బీఆర్ఎస్ అభ్యర్థి గోడం నగేష్‌పై 58,560 ఓట్ల అధిక్యంతో విజయం సాధించాడు. బీజేపీ తరఫున పార్లమెంట్‌కు ఎన్నికైన తొలి ఎంపీగా ఆయన రికార్డు సృష్టించాడు.

కారెక్కిన సింహం...



కారుపై సింహం గుర్తు

నిర్మల్‌ఖిల్లా: సింహం కారుపై ఎక్కడం ఏమిటని ఆశ్చర్యపోతున్నారా...! అవును ఇది నిజం. ఎన్నికల ప్రచారపర్వంలో రాజకీయ పార్టీలతో పాటు ఇతర రిజిస్టర్ పార్టీలు, స్వతంత్ర పార్టీల అభ్యర్థులు సైతం దూసుకుపోతున్నారు. ఇందులో భాగంగానే ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరఫున నిర్మల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచిన కార్మిక సంఘాల నేత స్వదేశ్ పరికిపండ్ల తన పార్టీ గుర్తు సింహం చిహ్నాన్ని ప్రత్యేకంగా తయారు చేయించాడు. నియోజకవర్గంలోని పలు మండలాల్లో తన ప్రచార వాహనం ద్వారా సింహం గుర్తును ఓటర్లకు తెలిసేలా ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా సింహం బొమ్మను తన కారుపైన ఉంచి ఆయా ప్రాంతాల్లో ప్రచారం నిర్వహిస్తున్నాడు. కారెక్కిన సింహం బొమ్మను చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఈ సందర్భంలోనే కారుపై సింహం ఉన్న చిత్రాలను 'సాక్షి' క్లిక్ మనిపించింది..

స్వతంత్ర అభ్యర్థిపై ఆర్వోకు ఫిర్యాదు

కైలాస్‌నగర్: తమ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన అంశాలతో ప్రచారం చేసుకుంటున్న స్వతంత్ర అభ్యర్థిపై చట్టపరంగా చర్య తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు ఆదిలాబాద్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి స్రవంతికి ఫిర్యాదు చేశారు. ఆదివారం ఆమెను కలిసి ఫిర్యాదు లేఖ అందజేశారు. ఈసీ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్న సదరు అభ్యర్థి తమ హామీలను ప్రచారం చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో టీపీసీసీ అసెంబ్లీ కోఆర్డినేటర్ కె.వెంకటేశ్, ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ మున్నా అబ్బాస్ హుస్సేన్ ఉన్నారు.

ఉదయం కాంగ్రెస్.. సాయంత్రం బీఆర్ఎస్‌లోకి



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న వినోద్



బీఆర్ఎస్‌లో చేరుతున్న నాయకులు

నెన్నెల: ఎన్నికల సమయంలో నేతలు గంటల వ్యవధిలో పార్టీలు మారుతున్నారు. నెన్నెల మండలం మెట్‌పల్లికి చెందిన ఉప సర్పంచ్ జాడి జ్యోతి, వార్డు సభ్యురాలు బోర్ల అరుణ ఆదివారం ఉదయం కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్ సమక్షంలో పార్టీలో చేరారు. సాయంత్రం మెట్‌పల్లిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాంచందర్, సర్పంచ్ శివప్రసాద్ ఆధ్వర్యంలో గులాబీ కండువా కప్పుకుని సొంత గూటికి చేరారు. నేతల ఒత్తిడితో పార్టీ మారారని ఇరు పార్టీల నేతలు ఆరోపించుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



ఘటన స్థలంలో గాయాలపాలైన హన్మంతు

నేరడిగొండ: మండలంలోని లఖంపూర్ బస్టాండ్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కేఎన్ఆర్ సంస్థలో పనిచేస్తున్న కూలీ మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే.. వారం రోజుల క్రితం కర్ణాటక రాష్ట్రంలోని గుల్‌బర్గాలోని చిత్తపూర్ గ్రామానికి చెందిన హన్మంతు (28) పనుల కోసం జిల్లాకు వచ్చాడు. ఈ క్రమంలో మండలంలోని లఖంపూర్ బస్టాండ్ ఎదురుగా జాతీయ రహదారిపై పనులు నిర్వహిస్తుండగా ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు అతివేగం, అజాగ్రత్తగా వచ్చి ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడిని ఎన్‌హెచ్ఏఐ అంబులెన్స్‌లో నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు ఏఎస్సై మారుతి తెలిపారు.

నర్సాపూర్(జీ): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కోక్కుల రాము(38) ద్విచక్ర వాహనంపై కుంటాల మండలం ఓలా గ్రామానికి బంధువుల అంత్యక్రియలకు వెళ్లాడు. తిరిగి వస్తుండగా రాత్రి నందన్ ఎక్స్ రోడ్డు సమీపంలో ఎదురుగా వస్తున్న ఐచర్ వాహనం ఢీకొనడంతో రాముకు తీవ్ర గాయాలవడంతో 108 లో నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు వెల్లడించారు. భార్య రేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ పేర్కొన్నారు.

విశ్రాంత కార్మికుల సమస్యలు మేనిఫెస్టోలో చేర్చాలి



మాట్లాడుతున్న సింగరేణి విశ్రాంత ఉద్యోగులు


పాతమంచిర్యాల: సింగరేణిలోవిశ్రాంత కార్మికుల సమస్యలపై రాజకీయ పార్టీలు మేనిఫెస్టోలో చేర్చాలని సింగరేణి కాలరీస్ రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని హైటెక్‌సిటీ కాలనీలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, గౌరవ అధ్యక్షుడు రాళ్లబండి రాజన్న మాట్లాడారు. సింగరేణి విశ్రాంత కార్మికులు చాలీచాలనీ పింఛన్‌తో కాలం వెళ్లదీస్తున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు రిటైరైన తర్వాత డీఏ, ఆరోగ్య బీమా కల్పిస్తామని రాజకీయ పార్టీలు హామీ ఇస్తున్నారే కాని సింగరేణి విశ్రాంత కార్మికుల గురించి పట్టించుకోవడం లేదన్నారు. తమకు తెల్లరేషన్ కార్డులు ఇవ్వాలని, ఆరోగ్యశ్రీ కార్డు, సొంతింటి నిర్మాణం కోసం 200 గజాల స్థలం, రూ.15 లక్షల వడ్డీలేని రుణం ఇవ్వాలని కోరుతూ రాజకీయ పార్టీల నాయకులకు ఈ-మెయిల్ ద్వారా వినతిపత్రాలు పంపించామన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు బైరి లక్ష్మీనారాయణగౌడ్, కార్యదర్శులు రామోజు రమేశ్, బూర్ల జ్ఞానీ, ముఖ్య సలహాదారు బోడ రాజమౌళి, నాయకులు పూదరి నర్సయ్య, గుండా సుధాకర్, విజ్ఞేష్, బానయ్య, నారాయణరావు, లక్ష్మణ్, బాలమల్లయ్య పాల్గొన్నారు.

నోటాపై నొక్కుతున్నారు..!

• ఉమ్మడి జిల్లాలో 37,360 ఓట్లు

2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో నోటాకు పోలైన ఓట్ల వివరాలిలా..

నియోజకవర్గం	2014	2018
సిర్పూర్	1,756	1,579
చెన్నూర్	1,616	2,135
బెల్లంపల్లి	763	2,598
మంచిర్యాల	1,482	1,394
ఆసిఫాబాద్	2,833	2,715
ఆదిలాబాద్	827	1,149
బోథ్	2,248	2,271
నిర్మల్	1,365	1,367
ముథోల్	1,792	2,267
ఖానాపూర్	2,427	2,776



భైంసాటౌన్/ఇచ్చోడ: నన్ ఆఫ్ ది ఎబోవ్‌కు సంక్షిప్త రూపం నోటా.. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నచ్చకపోతే ఓటరు తన ఓటు వేయడానికి ఆసక్తి చూపడు. దీంతో ఓటింగ్ శాతంపై ప్రభావం పడుతుందని గుర్తించిన ఎన్నికల సంఘం నోటాను ప్రవేశపెట్టింది. 2013 నుంచి ఇది అమలులోకి రాగా తెలంగాణలో 2014, 2018 ఎన్నికల్లో ఓటర్లు నోటాను విస్తృతంగా వినియోగించుకున్నారు. ఈవీఎంపై పోటీలో ఉన్న అభ్యర్థుల పార్టీ గుర్తులతో పాటు నోటా బటన్ సైతం అందుబాటులో ఉంచారు. అభ్యర్థుల్లో ఎవరికీ ఓటు వేయదల్చుకోకపోతే నోటాకు వేసేందుకు అవకాశం కల్పించింది. నోటాను ప్రవేశపెట్టినప్పటి నుంచి పలుమార్లు ఎన్నికలు జరిగాయి. ఈ క్రమంలో ప్రతీ ఎన్నికల్లో నోటాకు ఓట్లు పెరుగుతున్నాయే తప్పా తగ్గడం లేదు. నోటా అమలులోకి వచ్చిన తరువాత 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కలిపి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 37,360 మంది నోటాకు ఓటేశారు. 2014లో 17,109 మంది, 2018లో 20,251 మంది నోటాను వినియోగించుకున్నారు.

మీకు తెలుసా?

• మంచిర్యాలలో అత్యధిక మెజార్టీతో గెలిచిన ఎమ్మెల్యే

మంచిర్యాలఅర్బన్: లక్సెట్టిపేట్ నుంచి మంచిర్యాల నియోజకవర్గ ఆవిర్భావం వరకు అత్యధిక మెజార్టీతో గెలిచిన ఎమ్మెల్యేగా గడ్డం అరవిందరెడ్డి రికార్డు దక్కించుకున్నారు. 1952 నుంచి 2018 వరకు జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఇప్పటి వరకు అరవిందరెడ్డి 78,047 ఓట్ల మెజార్టీతో ముందు వరుసలో నిలిచారు. 2010 ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి గోనె హన్మంతరావుకు 17,264 ఓట్లు, టీఆర్ఎస్‌కు 95,311 ఓట్లు రాగా 78,047 ఓట్లతో ఆధిక్యత చాటుకున్నారు. 1952లో జరిగిన ఎన్నికల్లో లక్సెట్టిపేట్ నియోజకవర్గంలో విశ్వనాథరావు, కోదాటి రాజమల్లు, 1957, 1962లో జీవీ పితంబరావు, 1967, 1972లో జెవీ నర్సింగరావు, 1974(ఉ.ఎ) కేవీకె రావు, 1978లో చుంచు లక్ష్మయ్య, 1983లో మురళీమనోహరరావు, 1985, 1989లో జీవీ సుధాకర్‌రావు, 1994లో గోనె హన్మంతరావు, 1999, 2004లో దివాకర్‌రావు గెలుపొందారు. మంచిర్యాల నియోజకవర్గంలో 2009లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి దివాకర్‌రావుపై టీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం అరవిందరెడ్డి 13,827 ఓట్ల మెజార్టీ సాధించారు. తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో అరవిందరెడ్డి శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. 2010లో ఉప ఎన్నిక రాగా అరవిందరెడ్డి 78,047 మెజార్టీ సాధించారు. ఇప్పటి వరకు నాలుగు దఫాలు గెలిచిన దివాకర్‌రావు విజయబావుటా ఎగురవేశారు. లక్సెట్టిపేట్ నియోజకవర్గంగా ఉన్నప్పుడు 2004లో టీడీపీ అభ్యర్థి హన్మంతరావుకు 60,634, కాంగ్రెస్ అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావుకు 60,530 ఓట్లు వచ్చాయి. హోరాహోరీగా సాగిన పోరులో 166 ఓట్లు సాధించి అతి తక్కువ ఓట్లతో గెలుపొందిన జాబితాలో దివాకర్‌రావు చేరారు.

మున్నూరుకాపు సమావేశంలో ఉద్రిక్తత

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ పట్టణ శివారులోని చాందా(టి) వద్ద గల ఓ ప్రైవేట్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన మున్నూరుకాపు సంఘం సమావేశంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఎన్నికల నేపథ్యంలో సంఘానికి సంబంధించిన కొందరు సమావేశం కాగా ఈ విషయాన్ని తెలుసుకున్న మరో వర్గానికి చెందిన వారు అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో వారిమధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన ఇద్దరు పరస్పరం దాడికి దిగడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి వారికి నచ్చజెప్పారు. గొడవ సద్దుమనిగింది. ఈ విషయమై ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిని సంప్రదించగా అందుబాటులోకి రాలేదు. ఆర్డీఓ స్రవంతిని 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు విచారణ చేపడుతున్నారని తెలిపారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

• పండర్‌పూర్ యాత్రికులకు స్వాగతం పలికిన జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్



పల్లకిసేవలో జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

ఉట్నూర్‌రూరల్: ప్రతి ఒక్కరూ భక్తిమార్గంలో నడుచుకుంటూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆడే తుకారం మహారాజ్ ఆధ్వర్యంలో ప్రారంభించిన విఠల రుక్మాయి పండర్‌పూర్ యాత్ర ఆదివారం ఉట్నూర్ మండల కేంద్రానికి చేరుకోగా జెడ్పీ చైర్మన్ పల్లకి మోసి ఉట్నూర్ నుంచి పండర్‌పూర్ యాత్రను ప్రారంభించారు. భక్తులకు భోజన సౌకర్యం కల్పించారు. అనంతరం పాదయాత్రలో పాల్గొన్న భక్తులకు 500 దుప్పట్లు పంపిణీ చేసి మాట్లాడారు. ఈ యాత్రతో అనేక మంది చెడు వ్యసనాలకు దూరంగా ఉంచడమే లక్ష్యమన్నారు. వచ్చే 22వ తేదీన ఈ యాత్ర ఆదిలాబాద్ చేరుకుని అక్కడ నుంచి పండర్‌పూర్ వరకు అక్కడి నుంచి ప్రత్యేక రైలును ఏర్పాటు చేశామని తెలిపారు. ఆదివారం రాత్రి ఇంద్రవెల్లి మండల కేంద్రానికి చేరుకోగా రాధాకృష్ణ ఆలయంలో బస చేశారు. ఇంద్రవెల్లి హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భోజన, వసతి సౌకర్యాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ జెడ్పీటీసీ రాథోడ్ చారులత, నాయకులు ఆడే తుకారం, మారుతి మహారాజ్, కేర్బా మహారాజ్, గులాబ్ మహారాజ్, శ్రీనివాస్ మహారాజ్, తులసి రామ్ మహారాజ్, వంజారి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంటక్ ముండే, నార్నూర్ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ రాథోడ్ రమేష్, దావుల రమేష్, నర్సింగ్ మోరే, దుర్గే మహేందర్, విష్ణుఫడ్ ఉన్నారు.



పాదయాత్రలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్, భక్తులు

కోడి పందెంరాయుళ్ల అరెస్టు

భీమిని: కన్నెపెల్లి మండలం మెట్‌పల్లి శివారులో కోడి పందెం నిర్వహిస్తున్న ముగ్గురిని కన్నెపెల్లి ఎస్సై నరేశ్ అరెస్టు చేశారు. పక్కా సమాచారంతో ఆదివారం దాడి చేసి ముగ్గురి పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.2,050 నగదుతోపాటు ఒక కోడిపుంజు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

గుడుంబా పట్టివేత



గుడుంబాతో ఎక్సైజ్ సీఐ సంపత్‌కృష్ణ

ఖానాపూర్: ఖానాపూర్ మండలంలోని గోసంపల్లె గ్రామానికి చెందిన భూక్యా రాజు ద్విచక్ర వాహనంపై గుడుంబా తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సంపత్‌కృష్ణ, ఎస్సై రవి తెలిపారు. లక్ష్మణచాంద మండలం బాబాపూర్ వద్ద సమాచారం మేరకు వాహనాలను తనిఖీ చేస్తుండగా గుడుంబాను పట్టుకుని స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మద్యం పట్టివేత



కాగజ్‌నగర్ టౌన్: మద్యంతో ఎక్సైజ్ అధికారులు



బెల్లంపల్లి: పట్టుకున్న మద్యం బాటిళ్లు

బెల్లంపల్లి: ఓ యువకుడు తన ఇంటి వద్ద అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపునకు తీసుకువెళ్తున్న మద్యం బాటిళ్లను బెల్లంపల్లి పోలీసులు పట్టుకున్నారు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ బన్సీలాల్ కథనం ప్రకారం.. మండలంలోని బుగ్గగూడెం గ్రామానికి చెందిన కందుల నల్లందుల రాజేష్ బెల్లంపల్లి నుంచి మద్యం బాటిళ్లను తన ఇంటికి తీసుకెళ్తుండగా పాతబస్టాండ్ చౌరస్తా వద్ద ఆదివారం వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడి వద్ద నుంచి 60 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.4,800 ఉంటుందని తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

కాగజ్‌నగర్‌టౌన్: ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని తిరందాస్ కాలనీలో ఆదివారం ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. ఉమాజీ ఇంట్లో తనిఖీ చేయగా 14 యునైటెడ్ గోల్డ్ విస్కీ (180 ఎంఎల్) బాటిళ్లు లభించినట్లు ఎక్సైజ్ సీఐ మంగమ్మ తెలిపారు. జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతి కిరణ్ ఆదేశాలతోనే దాడులు చేసినట్లు పేర్కొన్నారు. పట్టుకున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకోవడంతోపాటు సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై కిషన్, సిబ్బంది ఉన్నారు.

అనారోగ్యంతో యువతి ఆత్మహత్య

సిరికొండ: అనారోగ్యంతో యువతి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని కన్నాపూర్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. అజ్మీరా పంతుబాయి, మల్కాన్ దంపతులకు ఆరుగురు కూతుర్లు, నాల్గో కూతురైన శీతాల్(19) పదో తరగతి పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటుంది. కొన్నిరోజులుగా పచ్చకామెర్ల వ్యాధితో బాధపడుతోంది. ఇటీవల వ్యాధి తీవ్రం కావడంతో శనివారం మధ్యాహ్నం బయటకు వెళ్లి పురుగుల మందు తాగి ఇంటికి వచ్చి వాంతులు చేసుకోగా గమనించిని కుటుంబ సభ్యులు రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించిఆదివారం సాయంత్రం మృతిచెందింది. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపాడు.